క్లుప్తంగా

నేడు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

కారేపల్లి: మండల పరిధిలోని అప్పాయిగూడెం రైతువేదిక భవనంలో శుక్రవారం ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ చేస్తారని సింగరేణి తహసీల్దార్ ఎస్.సంపత్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని పేర్కొన్నారు.

జమలాపురంలో సినీ దర్శకుడి పూజలు



ఆలయంలో దర్శకుడు మహేష్‌చంద్ర

ఎర్రుపాలెం: తెలంగాణా తిరుపతి జమలాపురం శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని గురువారం సినీ దర్శకుడు మహేష్‌చంద్ర దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలోని శ్రీవారికి, శ్రీఅలివేలు మంగ, శ్రీపద్మావతి అమ్మవార్లకు పూజలు నిర్వహించారు. ప్రధానార్చకుడు ఉప్పల శ్రీనివాసశర్మ, సిబ్బంది సినీ దర్శకుడిని సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ అయిలురి వెంకటేశ్వరరెడ్డి, ఎస్‌జేకేయం కరస్పాండెంట్ దండెం సత్యనారాయణరెడ్డి, కొప్పు రవి, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

వితరణ



కుర్చీలు అందజేస్తున్న దాతలు

బోనకల్: మండలంలోని బ్రాహ్మణపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు కుర్చీలు, టేబుళ్లను మందడపు అప్పారావు జ్ఞాపకార్థం కుటుంబసభ్యులు గురువారం వితరణగా అందజేశారు. అదేవిధంగా అదే గ్రామానికి చెందిన పారుపల్లి నరసింహారావు ఎలక్ట్రికల్ బెల్‌ను అందజేశారు. హెచ్‌ఎం వల్లూరు శ్రీనివాసరెడ్డి, యూపీఎస్ ప్రధానోపాధ్యాయులు గుగులోత్ రామకృష్ణ, సిబ్బంది ఉన్నారు.

దుస్తులు..

పెనుబల్లి : సప్తపది లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు పోట్రు వెంకటేశ్వరరావు కుమార్తె శ్రీరమ్య జన్మదినం సందర్భంగా గురువారం ఖమ్మం అన్నం ఫౌండేషన్ అనాథాశ్రమానికి దుస్తులు, క్వింటా బియ్యం వితరణగా అందజేశారు. పోట్రు వెంకటేశ్వరరావు, నిర్వాహకులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా..

ముదిగొండ: ట్రాక్టర్ టక్కు బోల్తాపడి డ్రైవర్‌కు గాయాలైన ఘటన మండలంలోని న్యూలక్ష్మీపురంలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం నుంచి పెద్దమండవ వైపు వెళ్తున్న ట్రాక్టర్ న్యూలక్ష్మీపురం సమీపంలో బోల్తాపడడంతో డ్రైవర్ వెంకటేశ్వర్లకు గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రుడిని 108 వాహనంలో ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

బైక్ అదుపుతప్పి..

చింతకాని: మండల పరిధిలోని తిరుమలాపురం క్రాస్ రోడ్డు ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడటంతో యువకుడికి గాయాలయ్యాయి. ఖమ్మం నగరానికి చెందిన వెంకటేశ్వర్లు బోనకల్ నుంచి ఖమ్మం వెళ్తుండగా రహదారిపై ఉన్న గుంతలు తప్పించబోయి వాహనం అదుపుతప్పి రహదారి పక్కనే ఉన్న గోతిలో పడ్డాడు. ఈ ప్రమాదంలో అతని తలకు గాయాలు కావడంతో స్థానికులు ఆస్పత్రికి తరలించారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

చింతకాని: నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీపీ కోపూరి పూర్ణయ్య అన్నారు. మండల పరిధిలోని లచ్చగూడెం గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణానికి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వరరావు, కిసాన్ సెల్ మండలాధ్యక్షుడు కొప్పుల గోవిందరావు, యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బందెల నాగార్జున, నాయకులు మడుపల్లి భాస్కర్, కన్నెబోయిన గోపీ, మండల అధికార ప్రతినిధి కూరపాటి కిషోర్, వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, రమేష్, నాగయ్య, మాధవరావు, రామకృష్ణ, రాంబాబు, శివ, పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

తల్లాడ: పంచాయతీ మల్టీపర్పస్ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని గురువారం ఎంపీడీఓ వి.చంద్రమౌళికి వినతిపత్రం అందజేశారు. ట్రాక్టర్ నడిపే వారికి డ్రైవింగ్ లైసెన్స్ ఇప్పించాలన్నారు. మల్టీ పర్పస్ వర్కర్ల యూనియన్ మండలాధ్యక్షుడు కంచెర్ల వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు శివ, భూక్యా రాజా, బొగ్గుల కృష్ణారెడ్డి, ఇమ్మడి రామక్రిష్ణ, ప్రభాకర్, మురళీ, కృష్ణ, నాగరాజు, నరిసింహారావు, సత్యం, రామక్రిష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇసుకాసురులు..



- యథేచ్ఛగా తోడేస్తున్న మాఫియా
- నదులు, వంకల నుంచి అక్రమంగా తరలింపు
- చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు



గన్నవరం సమీపంలో వైరా నది పరివాహక ప్రాంతంలో అక్రమంగా ఇసుక లోడింగ్

వైరారూరల్: సామాన్యుడికి ఇసుక అందని ద్రాక్షగానే మారింది. కానీ ఆర్థిక స్వలాభం కోసం కొందరు అందినకాడికి నదులు, ఏర్లు, వాగుల్లో ఉన్న ఇసుకను తోడేస్తున్నారు. అనుమతులకు విరుద్ధంగా అక్రమ రవాణా చేస్తున్నారు. పేద, మధ్యతరగతి వారి ఇంటి నిర్మాణానికి గోదావరి నుంచి ఒక లారీ ఇసుక కొనుగోలు చేయలంటే రూ.50 వేల నుంచి రూ.60 వేల వరకు వెచ్చించాల్సిన దుస్థితి నెలకొంది. సరే సమీపంలో నదులు, వాగులు, ఏర్లలో ఇసుకను తెచ్చుకుందామంటే అనుమతులు ఉండదు. నానా అగచాట్ల నడమ అనుమతులు సాధించుకున్న మార్గ మధ్యలో ఎవరో ఒకరు జరిమానా విధించడం ఆనవాయితీగా మారింది. అదే ప్రభుత్వ కార్యాకలాపాలు, కాంట్రాక్టర్లు పనుల పేరుతో అనుమతులు ఇస్తుండడంతో వారు యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా వైరా మండలంలో పరిపాటిగా మారింది. ఇది తెలిసిన పలు శాఖల అధికారులు కూడా. వారితో కుమ్మక్కై కనీస బాధ్యతగా ఉద్యోగ ధర్మం కూడా నిర్వర్తించకుండా చోద్యం చూస్తుండడం వారి పని తీరుకు నిదర్శనం.

మండలంలో ఇది పరిస్థితి...

వైరా మండలంలోని గన్నవరం, ఖానాపురం, కొండకొడిమ, గరికపాడు, లింగన్నపాలెం, నారపునేనిపల్లి, పుణ్యపురం, ముసలిమడుగు, స్టేజీపినపాక గ్రామాల సమీపంలోని నదులు, వంకలు ఉన్న ప్రాంతాలలో ఇసుక దిబ్బలున్నాయి. దీంతో అక్రమ సంపదనే లక్ష్యంగా పెట్టుకుని కొందరు ఇసుక మాఫియాకు తెరదించారు. పలువురు ప్రజాప్రతినిధుల అనుచరులు, తాజా మాజీ సర్పంచ్‌లు రెండు వర్గాలుగా ఏర్పడి వ్యాపారుల వద్ద నుండి ట్రాక్టరకు రూ.120 నుండి రూ. 200 చొప్పున కమీషన్లు తీసుకుని రాత్రి, పగలు అనే తేడా లేకుండా యథేచ్ఛగా ఇసుక దందా చేస్తున్న వ్యాపారులకు సహకరిస్తున్నారని వారి మాటను వినకపోతే బెదిరింపులకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. ట్రాక్టర్ ట్రక్కు ఇసుకను రూ.6,000 నుండి రూ.7,000 వరకు ప్రైవేటు వ్యక్తులకు విక్రయిస్తున్నట్లు పుకార్లు చక్కర్లు కొడుతున్నాయి. అంతేకాకుండా పలు చోట్ల ఇసుక క్వారీలను సైతం ఏర్పాటు చేసి కూలీల సాయంతో ట్రాక్టర్లలో ఇసుకను తోడేస్తున్నారని, ఎవరైనా ప్రశ్నిస్తే.. ప్రభుత్వ భవనాలు, పంచాయతీ రోడ్లకు వినియోగిస్తున్నట్లు చెబుతున్నారని స్థానికులు అంటున్నారు. నూతనంగా నిర్మించే ప్రభుత్వ భవనాలకు సైతం నాణ్యమైన గోదావరి ఇసుక వాడాలి కానీ ఏరులోని ఇసుకను దేనికి వాడుతున్నారని ప్రభుత్వ పథకాలకా.. లేక వారి ఆర్థిక స్వలాభల కోసమా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

ర్యాంపులు లేవు కానీ..

వైరా మండలంలో అధికారికంగా ఎలాంటి ఇసుక ర్యాంపులు లేవు. ఎవరైనా స్థానికంగా ఉండే నదుల నుండి ఇసుకను తెచ్చుకోవాలంటే.. పక్క మండలాల్లోని గ్రామాల్లో నదులలో అధికారుల అనుమతులు (కూపన్లు) తీసుకుని ఇసుకను రవాణా చేసుకుంటారు. కానీ మండలంలో ఎలాంటి అనుమతులు లేకుండానే పలు గ్రామాల సమీపంలో ఉన్న నదుల నుండి ఇసుకను కూలీలను పెట్టి మరీ తోడుతున్నారు. అనంతరం పలు గ్రామాలకు అనుసంధానంగా ర్యాంపులు ఏర్పాటు చేసి ఇళ్ల నిర్మాణాలు, తదితర వాటికి విక్రయిస్తున్నారు. ఈ దందా అధికారుల కనుసన్నల్లోనే జరుగుతున్న పట్టింపు కరువైంది. దీంతో ఇసుక మాఫియా ఆగడాలకు హద్దు అదుపు లేకుండా పోయింది.

నిబంధనలు ఇలా..

సహజంగానే వాగులు, నదుల నుండి ఇసుకను తోలుకోవాలంటే ముందస్తుగా తహసీల్దార్ పేరు మీద రూ.వెయ్యి డీడీ తీసి వారు ఇచ్చే అనుమతితో ఇసుక తోలుకోవాలి. అది కూడా ఉదయం నుంచి సాయంత్రం 6 గంటల లోపు కేవలం ఒక ట్రిప్పు (ట్రాక్టర్) మాత్రమే తోలుకునేందుకు అనుమతి ఉంటుంది. కానీ ఇక్కడ మాత్రం ఈ నిబంధనలకు విరుద్ధంగా దందా సాగుతోంది.

అధికారుల తీరుపై విమర్శలు..

సామాన్యుడు ఇసుకను తోలుకుంటే పలు రకాల అనుమతులు అడిగి కొర్రీలు వేసే అధికారులు వీరిని పట్టించుకోకుండా ఎందుకు నిమ్మకు నీరెత్తినట్లు ఉంటున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. నిత్యం పదుల సంఖ్యలో ట్రాక్టర్లు ఇసుకను అక్రమంగా తోలుతున్న పట్టింపులేకుండా పోయింది. ఒక వేళ ఇసుక ట్రాక్టర్లు.. పట్టుకున్న నిమిషాల వ్యవధిలో వాటిని విడిచిపెట్టి చోద్యం చూస్తున్నారు. ఈ తంతు నెలల తరబడి జరుగుతున్నా కనీసం ఉన్నతాధికారులు పర్యవేక్షణ కూడా లేకుండా పోయింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం..



మండలంలోని అధికార ఇసుక ర్యాంపులు లేవు. ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా అక్రమ ఇసుక దందా వ్యాపారం చేస్తే ఉపేక్షించకుండా వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటాం. అలాగే ప్రభుత్వ అభివృద్ధి పనులకు కూడా వైరా నది పరివాహక ప్రాంతంలో ఇసుకను తోడేందుకు అనుమతులు లేవు. మండలంలోని వైరా నది ఏటిలో ఎవరైనా ఇసుకను తోడినట్లు రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకోని వస్తే వారిపై శాఖపరమైన చర్యలు తీసుకుంటాం.

– కేవీ.శ్రీనివాసరావు, తహసీల్దార్, వైరా

నామినేటెడ్ పోస్టుల్లో ప్రాధాన్యత ఇవ్వాలి



కల్లూరు: మాట్లాడుతున్న శేఖర్‌గౌడ్

సత్తుపల్లిరూరల్/కల్లూరు: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావటానికి కిసాన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సైనికుల్లా కష్టపడ్డారని, నామినేటెడ్ పోస్టుల్లో కిసాన్ కాంగ్రెస్‌కు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు మొక్క శేఖర్‌గౌడ్ అన్నారు. గురువారం సత్తుపల్లి, కల్లూరులో జరిగిన సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ.. ఖమ్మం జిల్లాకి చెందిన వారికే ఎంపీ టికెట్ ఇవ్వాలన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం వచ్చాక రైతుల పరిస్థితులు దుర్భరంగా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు. స్వామినాథన్ కమీషన్ సిఫారెస్ మేరకు రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సత్తుపల్లిలో నిర్వహించిన సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రావుల పుల్లారావు, గోపి, సురేష్‌రెడ్డి, శీలం బ్రహ్మారెడ్డి, రాజశేఖర్‌గౌడ్, సురేష్, కల్లూరులో జిల్లా ప్రధాన కార్యదర్శి చీమలదారి గోపి, మండలాధ్యక్షుడు శీలం బ్రహ్మారెడ్డి, నాయకులు గోసు వెంకటకృష్ణ, ముత్యాల కిరణ్‌రెడ్డి, గార్ల రాజశేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి



సైకిళ్లు అందజేస్తున్న క్లబ్ సభ్యులు

చింతకాని: పట్టుదల, క్రమశిక్షణతో చదువుతూ విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వీవీ పాలెం సొసైటీ చైర్మన్ రావూరి సైదుబాబు తెలిపారు. ఖమ్మం సెంట్రల్ రోటరీక్లబ్ వారి ఆధ్వర్యంలో మండల పరిధిలోని కొదుమూరు ఉన్నత పాఠశాల విద్యార్థినులకు గురువారం సైకిళ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు శ్రీనివాసరావు, అసిస్టెంట్ గవర్నర్ సాయి భార్గవ్, కోశాధికారి ప్రవీణ్‌కుమార్, సభ్యులు చాగంటి వెంకటేశ్వరరావు, హెచ్‌ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షకు 16 మంది గైర్హాజరు

కల్లూరు: ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షకు గురువారం రెండు కేంద్రాల్లో 16 మంది గైర్హాజరయ్యారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 177 మందికి 14 మంది, గురుకుల కళాశాలలో 147 మందికి ఇద్దరు విద్యార్థులు గైర్హాజరైనట్లు పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్‌లు ఎస్‌కె.అతాహార్ అలీ, శ్రీలత పేర్కొన్నారు.

దాడి అమానుషం

కొణిజర్ల: కాంగ్రెస్ నాయకుడు, కొణిజర్ల మాజీ సర్పంచ్ సూరంపల్లి రామారావుపై దాడి అమానుషమని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్, స్వర్ణ రమేష్‌లు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆస్పత్రిలో రామారావును పరామర్శించారు. దాడికి పాల్పడ్డ దుండగులను తక్షణమే కఠినంగా శిక్షించాలన్నారు.

మళ్లీ నాలుగేళ్లకే..

లీప్ ఇయర్ సందర్భంగా గురువారం పలువురు పుట్టినరోజు, వివాహ వార్షికోత్సవాలు నిర్వహించారు. మళ్లీ నాలుగేళ్ల తర్వాతే వార్షికోత్సవం వస్తుంది. అందుకే ఘనంగా సంబురాలు జరుపుకున్నారు. అదేవిధంగా ముహూర్త బలం కుదరడంతో పలువురు వివాహాలు గురువారమే చేసుకున్నారు.

– వైరా, వైరారూరల్, కొణిజర్ల, ముదిగొండ



వైరారూరల్: లావిష్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు..



ముదిగొండ: వివాహ వార్షికోత్సవ వేడుకలు..



వైరా: సాయికుమార్-రమ్య



కొణిజర్ల: రాజా- శ్రీ రేణుక

బీమా చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న కృష్ణయ్య

సత్తుపల్లి: ప్రభుత్వ సామాజిక భద్రత పథకాలను అందిపుచ్చుకునేందుకు డీసీసీబీలో వ్యక్తి గత అకౌంట్‌ను తీసుకోవాలని డీసీసీబీ డైరెక్టర్ చల్లగుండ్ల కృష్ణయ్య, మేనేజర్ ఎం.రజిత అన్నారు. స్థానిక డీసీసీబీ కార్యాలయంలో గురువారం అనారోగ్యంతో మృతి చెందిన పలగాని బాలాజీరావు కుటుంబానికి బీమా కింద రూ.2 లక్షల చెక్కును అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డీసీసీబీ బ్యాంక్‌లో సులభంగా అకౌంట్లు ఓపెన్ చేస్తున్నామని, దీనిపై ఇప్పటికే రైతులు, స్వయం సహాయక సంఘాలు, డ్వాక్రా మహిళలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టామన్నారు. సూపర్‌వైజర్‌రాకేష్, సర్తాజ్ పాల్గొన్నారు.

కార్మికశాఖ కార్యాలయం ఎదుట ధర్నా



ధర్నా చేస్తున్న నాయకులు

సత్తుపల్లిరూరల్: ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సత్తుపల్లిలోని కార్మికశాఖ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు నిమ్మటూరి రామకృష్ణ మాట్లాడుతూ... దేశంలోని మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలు, భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో తడికమళ్ల యోబు, తెలగారపు రామారావు, భాస్కర్, చిట్టిబాబు, శ్రీనివాసరావు, పుల్లమ్మ, సత్యావతి, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా యాగం

ఎర్రుపాలెం: మండలంలోని తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన జమలాపురం గ్రామ సమీపంలో కాంగ్రెస్ నాయకులు వేజండ్ల సాయికుమార్ ఆధ్వర్యంలో శ్రీ రాజశ్యామల మహాయాగం గురువారం వైభవోపేతంగా ప్రారంభమైంది. ఈ యాగం మూడు రోజుల పాటు జరగనుంది. పురోహితులు మడుపల్లి సతీష్ శర్మ ఆధ్వర్యంలో యాగపూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శిరీష, మాజీ ఎంపీటీసీ సామనూరి కృష్ణార్జునరాజు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ప్రమేయంతోనే అభివృద్ధి పనులు

- తాగునీటి ఎద్దడి రాకుండా ప్రణాళిక రూపొందించాలి
- నియోజకవర్గ అభివృద్ధిపై సమీక్ష సమావేశంలో మంత్రి పొంగులేటి



మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పక్కన ఎమ్మెల్యే రాగమయి, తదితరులు

కల్లూరురూరల్: ఎమ్మెల్యే ప్రమేయంతోనే నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపట్టాలని రాష్ట్ర రెవెన్యూ శాఖామంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. మండలంలోని స్వగ్రామం నారాయణపురంలో గురువారం సత్తుపల్లి నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నియోజకవర్గంలో ప్రతీపని ఎమ్మెల్యే దృష్టిలో ఉండాలన్నారు. వేసవి దృష్ట్యా తాగునీటి సమస్య తలెత్తకుండా మిషన్ భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. తాగునీటికి సంబంధించి ఏమైనా ఫిర్యాదులు అందినట్లయితే సంబంధిత అధికారులను బాధ్యులను చేయాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు. గత ప్రభుత్వ మాదిరిగా తప్పుడు కేసులు పెట్టొద్దని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పోలీసు అధికారులను కోరారు. ఇక్కడ పని చేయలేమని ఎవరైనా అధికారులు భావిస్తే వారు కోరుకున్న ప్రాంతానికి బదిలీ చేస్తానన్నారు. సింగరేణి, డీఎంఎఫ్‌టీ నిధుల నుంచి మంజూరైన రూ.11.5 కోట్లలతో అభివృద్ధి పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ నెల 4వ తేదీన పోడు భూముల వివాదంపై సత్తుపల్లిలో సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, డీసీసీబీ మాజీ చైర్మన్ మువ్వా విజయబాబు, మిషన్ భగీరథ గ్రిడ్ డీఈఈ హరి, ఏఈలు శ్రీధర్, సింధు, జయలక్ష్మి, నితిన్, పంచాయతీరాజ్ డీఈఈ రాంబాబు, తహసీల్దార్లు పులి సాంబశివుడు, యోగేశ్వరరావు, కల్లూరు ఏసీపీ రఘు, ఏఎస్‌పి వెంకటరాములు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువులో రాణించాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జెడ్పీ చైర్మన్ కమల్‌రాజ్

ఎర్రుపాలెం: విద్యార్థులు క్రమశిక్షణతో బాగా చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకునే దిశగా రాణించాలని జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్, ఎస్‌ఆర్‌ఐ వేమిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని భీమవరం గ్రామంలోని వీవీఆర్ జెడ్పీ ఉన్నత పాఠశాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి వెంకటరెడ్డి వితరణ చేసిన బ్యాగులు, యూనిఫాంలు విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఆర్‌ఐలు లక్కిరెడ్డి ప్రకాష్‌రెడ్డి, లక్కిరెడ్డి వెంకటరెడ్డి, జెడ్పీటీసీ శీలం కవిత, ఎంపీటీసీ సంక్రాంతి కృష్ణారావు, హెచ్‌ఎం సుభద్రాదేవి, పీఈటీ జీవీఎస్ఎన్‌రెడ్డి, శేగిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు శీలం జయలక్ష్మి, షేక్ బహదూర్‌ఖాన్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పల్స్‌పోలియోను విజయవంతం చేయండి

సత్తుపల్లిటౌన్: ఈ నెల 3న నిర్వహించే జాతీయ పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గంగారం పీహెచ్‌సీ వైద్యులు ఆర్.అవినాష్ కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండల టాస్క్‌ఫోర్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంపీపీ దొడ్డా హైమావతి, తహసీల్దార్ యోగేశ్వరరావు, ఎంపీడీఓ చిన్న నాగేశ్వరరావు, ఎంపీఓ కృష్ణయ్య, ఎంఈఓ రాములు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ఏన్కూరు: పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ ఆరెం వరలక్ష్మీ కోరారు. ఈ మేరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ బాదావత్ బుజ్జీ, ఎంపీడీఓ సకినాల రమేష్, ప్రభుత్వ వైద్యాధికారి బి రాములు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వెంకటామ్మ పాల్గొన్నారు.



ఏన్కూరు: మాట్లాడుతున్న ఎంపీపీ వరలక్ష్మి



సత్తుపల్లిటౌన్: మాట్లాడుతున్న డాక్టర్ అవినాష్

జాతర పేరుతో దోపిడీ



జాతర ప్రాంతాన్ని పరిశీలిస్తున్న నాయకులు

మధిర: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మధిర మృత్యుంజయ స్వామి ఆలయం వద్ద నిర్వహిస్తున్న జాతరలో భక్తులు దోపిడీకి గురవుతున్నారని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు శీలం నరసింహారావు ఆరోపించారు. గురువారం జాతర జరిగే మధిర శివాలయాన్ని పార్టీ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతరకు వచ్చే భక్తులకు వినోదాన్ని అందించేందుకు ఆటవస్తువులు ఏర్పాటుచేసి భారీగా టిక్కెట్లు ధరలు నిర్ణయించారన్నారు. పేదలకు అందుబాటులో ఉండే విధంగా ధరలను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మందా సైదులు, పడకంటి మురళి పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ

కారేపల్లి: కారేపల్లిలోని శ్రీ పెద్దమ్మతల్లి ఆలయంలో పోతురాజు విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని గ్రామస్తులు గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయ పూజారి మల్లిఖార్జున శర్మ ఆధ్వర్యంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి పోతురాజుకు మొక్కులు చెల్లించారు.

ఆరోగ్య కేంద్రం తనిఖీ

వేంసూరు: వేంసూరు ప్రాథమిక వైద్యశాలను గురువారం ఎమ్మెల్యే మట్టా రాగమయి గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... వైద్యకేంద్రంలో మరమ్మతులకు కేటాయించిన నిధులు దుర్వినియోగం అయ్యాయని, ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు ఆమె తెలిపారు. ఈ మేరకు మూడు నెలలుగా జీతాలు రాక ఇబ్బంది పడుతున్నామని, వేతనాలు ఇప్పించాలని ఆస్పత్రి సిబ్బంది వినతిపత్రం అందజేశారు. నాయకులు మట్టా దయానంద్, ఎంపీటీసీ రాఘవరెడ్డి, మాజీ సర్పంచ్ ఎండి పైజుద్దీన్, ఎండీ పకృద్దీన్, దొడ్డ శ్రీనివాసరావు, సుబ్బారెడ్డి, వైద్యులు డాక్టర్ ఇందుప్రియ, సిబ్బంది పాల్గొన్నారు.

వంతెనపై గుంతలు పూడ్చాలి

వైరారూరల్: ఖమ్మం–రాజమండ్రి జాతీయ ప్రధాన రహదారికి అనుసంధానంగా ఉన్న స్టేజీ పినపాక సమీపంలోని హైలెవల్ వంతెన మీద అధికారులు తీసిన గుంతలను తక్షణమే పూడ్చి, శిథిలావస్థలో ఉన్న వంతెనకు ప్రత్యామ్నాయంగా నూతన బ్రిడ్జిని నిర్మించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో గురువారం హైలెవల్ వంతెన ఉన్న గుంతలను పరిశీలించి నిరసన తెలిపారు. మరమ్మతుల కోసం గుంతల తీసి పూడ్చకుండా వదిలేశారని, దీంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తోట నాగేశ్వరరావు. పారుపల్లి కృష్ణారావు, కొల్లా వెంకటేశ్వరరావు, బాజోజు రమణ, కోటా ప్రేమ్, నాగరాజు పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయండి

సత్తుపల్లిటౌన్: ఈ నెల 3, 4, 5వ తేదీల్లో ఖమ్మంలో జరిగే సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా యూనిటీ మహాసభలను విజయవంతం చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. గురువారం సత్తుపల్లిలో మహాసభల విజయవంతం కోసం ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేశంలో మోదీ ప్రభుత్వం రాజ్యాంగం ద్వారా రాష్ట్రాలకు సంక్రమించిన ఫెడరల్ హక్కులను కాలరాస్తుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గంటా శ్రీనివాసరావు, అమర్లపూడి శరత్, రాజు, నాగిరెడ్డి, వెంకటేష్, భాస్కర్‌రావు, కామేష్, వెంకయ్య, సురేష్, నాగేష్ పాల్గొన్నారు.

కారేపల్లి: ఖమ్మంలో జరిగే సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ యూనిటీ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని బైక్ ర్యాలీ నిర్వహించారు. పార్టీ మండల కార్యదర్శి గుమ్మడి సందీప్, సహాయ కార్యదర్శి ఎస్‌వీ రాకేష్, డివిజన్ కార్యదర్శి గుగులోతు తేజానాయక్, నాయకులు వడ్డె వెంకటేశ్వర్లు, భాస్కర్, సత్తిరెడ్డి, చల్ల రాజు, తాటి పాపారావు, రావుల నాగేశ్వరరావు, కోయల శ్రీను, వేములపల్లి వీరన్న, కనకరాజు, రాము, సోమనబోయిన ఉపేందర్, భూక్యా శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.



సత్తుపల్లిటౌన్: ప్రదర్శనలో పాల్గొన్న నాయకులు



కారేపల్లి: ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు